- ఇదేనా మాకిచ్చే గౌరవం..
- బీఆర్ఎస్‌లో మైనారిటీల తిరుగుబాటు
- సమన్వయ కర్తల ఎంపికలో తీరని అవమానం చేశారంటూ మండిపాటు
- బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటామని అల్టిమేటం
- 55వేల ఓట్లు ఉన్న ముస్లింలను అవమానించడమేనని వ్యాఖ్యలు
- ఆ కమిటీలు ఉత్తుత్తివేనన్న బీఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధు
- నేడు పువ్వాడ అజయ్ పుట్టిన రోజు వేడుకలను బహిష్కరిస్తున్నట్టు చర్చ

# బీఆర్ఎస్‌లో ముస్లింల తిరుగుబాటు..?


## సరిదిద్దేందుకు తాతా మధు యత్నం

వనం నాగయ్య, కెరటం న్యూస్

'ముస్లింలు అంటే అంత చులకనయ్యారా..? నియోజకవర్గంలో 55 వేల ఓటు బ్యాంకు ఉండి, అభ్యర్థి గెలుపోటములను నిర్ణయించగల సంఖ్యా బలం ఉన్న మాపై ఇంత చిన్నచూపా.. బీఆర్ఎస్‌ను నమ్ముకున్నందుకు మాకు తగిన శాస్తి జరిగింది.. ఇక మేం ఈ అవమానాన్ని భరిం చలేము.. మూకుమ్మడిగా రాజీనామాలు చేసి ఖమ్మం పార్లమెంటు బరిలో బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉంటాం.. మా సత్తా ఏంటో చూపిస్తాం.. జిల్లాలో నాయకుల సూచనలు లేకుండానే కేటీఆర్ సమన్వయ కర్తల పేర్లు ప్రకటించారా..? అందుకే మా దారి మేం చూసు కుంటాం.. శు క్రవారం ఖమ్మంలో జరిగే పువ్వాడ అజయ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను బహిష్కరించి మన ఐక్యత చాటుకుందాం..' అంటూ బీఆర్ఎస్‌కు చెందిన ముస్లింలు సొంత పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. గురువారం సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ సమన్వయ కర్తల కమిటీ జాబితాలో ముస్లిం మైనారిటీలకు ఒక్కరి పేరు కూడా లేక పోవడం ముస్లింల తిరుగు బాటుకు కారణమైంది. నియోజక వర్గంలో 55వేల ఓటు బ్యాంకు కలిగిన ముస్లింలను కూరలో కరివేపాకులా తీసేశారని వారు మండి పడుతున్నారు. సామూహికంగా రాజీనామాలు చెయ్యాలని చర్చించు కున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించినట్టుగా సోషల్ మీడియాలో ప్రచారం అయిన వివిధ నియోజక వర్గాల సమన్వయ కర్తల జాబితా ఇక్కడి జిల్లా నాయకులకు తెలియ కుండానే జాబితా ప్రకటించారా..? అంటూ మండి పడుతున్నారు.

### అసలేం జరిగిందంటే..

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సమన్వయకర్తలు వీరేనంటూ సోషల్ మీడియాతో పాటు, వివిధ పత్రికల్లో గురువారం వార్తలు వెలువడ్డాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించినట్లుగా ఆ జాబితాలో పలువురి పేర్లు వచ్చాయి. వారిలో పాలేరు నియోజకవర్గానికి ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, ఖమ్మం నియోజ కవర్గానికి కూరాకుల నాగభూషణం, వైరాకు తాళ్లూరి జీవన్, మధిరకు కొండబాల కోటేశ్వరరావు, కొత్తగూడెం నియోజకవర్గానికి ఉప్పలపాటి వెంకటరమణ, సత్తుపల్లికి బీరెడ్డి నాగచంద్రారెడ్డి, అశ్వారావుపేటకు కోనేరు చిన్నిల పేర్లు ప్రకటిస్తూ వైరల్ అయ్యాయి. ఈ జాబితాయే ఇప్పుడు ముస్లిం లలో ఆగ్రహానికి కారణమై, తిరుగుబాటుకు కారణమైందన్న చర్చ జరుగుతోంది. నమ్మి



బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని జిల్లా ఎన్నికల అధికారులను కలిసి వస్తున్న షేక్ బాజీబాబా...

బీఆర్ఎస్‌లో ఉన్నందుకు బాగానే బుద్ధి చెప్పారనీ, కేవలం మీ పల్లకీ మోసే బోయిలుగానే చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఎన్నికల వేళ రాజీనామాల అస్త్రం..

ఖమ్మం పార్లమెంటు ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో సమన్వయ కర్తల కుంపటి రగిలింది. ఫలితంగా తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వని బీఆర్ఎస్‌లో ఎందుకుండాలని రాజీనామాలు చేసి మనమే పార్లమెంటు బరిలో ఉండాలని ముస్లింలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు ఇదే సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. అసలే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయాన్ని మూటగట్టుకుని, తీవ్ర నైరాశ్యంలో ఉన్న బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఈ జాబితా రూపంలో మరింత తలనొప్పిగా మారిందన్న చర్చ జరుగుతోంది. దాదాపు 55వేల ఓటు బ్యాంకు కలిగిన వారిని అవమానించారని ముస్లింలు మండి పడుతున్నారు. మమ్మల్ని అణగదొక్కే ప్రయత్నం జరుగుతుందని, నియోజకవర్గ బాధ్యులను తక్షణమే మార్చి అందరికీ అవకాశం కల్పించాలని లేదంటే మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తామని మైనార్టీలు అల్టిమేటం జారీచేశారు.

### బాజీబాబా నామినేషన్..?

నియోజకవర్గాల సమన్వయకర్తల జాబితాతో రగిలిపోతున్న ముస్లింలు దూకుడు పెంచారు. ఏకంగా బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా ఖమ్మం పార్లమెంట్ బరిలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు బాజీబాబా శు క్రవారం నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఉదయం 11 గంటలకు మైనార్టీ పెద్దలతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయ నున్నట్టు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా ముస్లిం మైనార్టీ కే అవకాశం కల్పించాలని పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జిల్లా నాయకత్వానికి విన్నవించినా స్పందించక పోవడంతో ముస్లిం హక్కుల ప్రయోజనాల కోసమే తాను పోటీ చేస్తున్నట్లు బాజీబాబా తెలిపారు. అదేవిధంగా మాజీ గ్రంథాలయ చైర్మన్ ఖమర్ సైతం బీఆర్ఎస్ పార్టీపై గుర్రుగా ఉన్నారని ముస్లింలలో చర్చజరుగుతోంది.

### సరదిద్దే ప్రయత్నంలో జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్..

జిల్లాలో ముస్లిం మైనారిటీల ఆగ్రహానికి కారణమైన సమన్వయ కర్తల జాబితాపై ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ వెంటనే స్పందించారు. అది తప్పుడు ప్రకటన అన్నారు. ఈ విషయమై జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ మీడియాకు సమాచారం అందించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ పేర్లు తప్పు అన్నారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు బాధ్యులను నియమిస్తామన్నారు. ఇది పొరపాటుగా వైరల్ చేశారని తాతా మధు అన్నారు. కాగా తీవ్ర ఆగ్రహంతో ఉన్న ముస్లింలను తాతా మధుసూదన్ వారితో చర్చలు జరిపి, కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడించి, వారిని సముదాయించేందుకు ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. తాతా మధు, కేటీఆర్ హామీతో ముస్లింలు కాస్త చల్లబడినట్టుగా తెలుస్తోంది. కాగా నేడు జరిగే పువ్వాడ అజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలకు ముస్లింలు హాజరవుతారో లేదో వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో ముస్లిం మైనారిటీల్లో ఇదో కొత్త వివాదానికి దారితీసింది.